క్లుప్తంగా

4న శ్రీమద్భాగవత సప్తాహం

అంబాజీపేట: స్థానిక పెద్దవీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ ఏసీ కల్యాణ మండపంలో ఈ నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు శ్రీమద్భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు అప్పన రవికుమార్, రేవతి దంపతులు తెలిపారు. ఈ ప్రవచనాలను శ్రీనివాస రామానుజదాసుతో గావిస్తారన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు జరుగుతాయన్నారు. భక్తులంతా విచ్చేసి ప్రవచానాలను గావించాలని కోరారు.

పెద్దింటికి 'అక్కినేని' పురస్కారం



హైదరాబాద్‌లో రామంను సత్కరిస్తున్న ప్రముఖులు

కొత్తపేట: ప్రముఖ జ్యోతిష పండితుడు, కొత్తపేటకు చెందిన పెద్దింటి రామచంద్రశ్రీహరి (రామం) శ్రీభారతి అక్కినేని పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నటుడు డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు నిర్వహించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని అక్కినేని పురస్కారాలకు ఎంపిక చేశారు. వారిలో రామం సమాజ సేవ, వివిధ వినూత్న సేకరణలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో సేవలపై పురస్కారానికి ఎంపిక చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్ త్యాగరాజ గాన సభా ప్రాంగణంలో శ్రీభారతి అకాడమి చైర్మన్ చింతలపాటి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు నిట్టల గోపాలకృష్ణ, సినీ నటుడు పృథ్వీరాజ్, తిరుమల బ్యాంకర్స్ అధినేత కె.చంద్రశేఖర్ తదితరుల చేతు మీదుగా అక్కినేని పురస్కారంతో రామంను ఘనంగా సత్కరించారు.

అంతర్వేది ఆలయంలో ఇన్‌కంట్యాక్స్ అధికారి



స్వామివారి సన్నిధిలో రమాకాంత్ పాండా

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం ఇన్‌కంట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(హైదరాబాదు) వైస్ ప్రెసిడెంట్ రమాకాంత్ పాండా కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస్ కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలకగా, సూపరింటెండెంట్ పి.విజయ సారథి స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు.

జస్వంత్‌కు ఆర్థిక సాయం



రామేశ్వరంలో జస్వంత్‌కు సాయం చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: మండలంలోని రామేశ్వరానికి చెందిన చెల్లుబోయిన జస్వంత్‌కు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు రూ.76 వేల సాయాన్ని ఆదివారం అందజేశారు. జస్వంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స నిమిత్తం గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవా సంస్థ రూ.63 వేలు, స్థానిక యూత్ సభ్యులు రూ.13 వేలు కలిపి మొత్తం రూ.76 వేలు సమకూర్చారు. ఈ మేరకు పై మొత్తాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అతడికి ఇచ్చారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ కట్టా ఉమా మహేశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, స్థానికులు బళ్ల లక్ష్మణ్, ఎ.మధురాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



శేఖర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కేవీ శేఖర్ దంపతులను ఘనంగా సన్మానించారు. మండలంలోని ర్యాలి హైస్కూల్ వద్ద పూర్వ విద్యార్థులు, అప్పటి గురువులు కుడుపూడి నాగభూషణం ఆధ్వర్యంలో శేఖర్ మాస్టార్ దంపతులు సత్కరించారు.

ఆసుపత్రిలో పింఛన్ అందజేత

సఖినేటిపల్లి: మోరి-1 సచివాలయ పరిధిలోని చొప్పల మేరీమణికి రాజోలు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బెడ్‌పై పింఛన్‌ను సదరు సెచివాలయ వలంటీర్ బీర మేరీ ఆదివారం అందజేశారు. ఆసుపత్రిలో పక్షవాతంతో చికిత్స పొందుతున్న మేరీమణి వద్దకు ఈ మేరకు వలంటీర్ మేరీ వెళ్లి వృద్ధాప్య పింఛన్ ఇచ్చారు.

అప్రమత్తతే ఆయుధం

- పొంచి ఉన్న సీజనల్ జ్వరాల ముప్పు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



అంబాజీపేటలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: వర్షాకాలం వచ్చేసింది. ప్రతికూల వాతావరణం వల్ల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. దోమకాటు వలనే అధిక జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు పటిష్ట పారిశుధ్య చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే జ్వరాల బారిన పడకుండా ఉంటారని వైద్యులు చెబుతున్నారు. కొన్ని రకాల జ్వరాలు ప్రాణాంతకంగా మారుతుంది. జ్వరమే కదా అని తేలికగా తీసుకోకుండా సత్వర వైద్యం తీసుకోవడం చాలా ముఖ్యమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. రోజురోజుకీ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఎండ కాస్తూనే వర్షం కురవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధులు అధికంగా వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులు కూడా రోగులతో కిటకిటలాడుతున్నాయి. కొత్తపేటలో 26, రావులపాలెంలో 23, ఆలమూరులో 24, ఆత్రేయపురంలో 26, రాజోలులో 20, మలికిపురంలో 22, సఖినేటిపల్లిలో 20, అంబాజీపేటలో 19, పి.గన్నవరంలో 23, మామిడికుదురులో 22, అయినవిల్లిలో 22 సచివాలయాల పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి అవగాహన

గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుంది. వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేస్తూనే పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరిస్తున్నారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలను, రోడ్లను శుభ్రంగా ఉంచడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా ముఖ్యమని చెబుతున్నారు. గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు. బురదగా ఉన్న చోట బ్లీచింగ్ చల్లేలా చర్యలు తీసుకుంటున్నారు. జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన రోగులకు మందులు ఇవ్వడమే కాకుండా అత్యవసరమైతే సిలైన్ కూడా పెడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, తాగేసిన కొబ్బరిబొండాలు, రుబ్బురోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. తినే ఆహారం, తాగే నీరు కలుషితం కాకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే మాత్రమే తాగాలి. ఆహారం తీసుకునే ముందు, మల విసర్జన తరువాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచాలకు దోమ తెరలు, కిటికీలు, గుమ్మాలకు దోమల మెస్‌లు వేసుకోవాలి. ఇంట్లో చిన్న పిల్లలు ఉంటే వారి శరీరం పూర్తిగా కప్పి ఉండేలా దుస్తులు వేయాలి.

వేగంగా వైద్యసేవలు



జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో వచ్చే రోగులందరికీ సత్వర వైద్యం అందిస్తున్నాం. ఈ లక్షణాలతో వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయిస్తున్నాం. అవసరమైన వారికి సిలైన్ పెడుతున్నాం. రోగాల బారిన పడకుండా ఉండాలంటే ఇంటిని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రోగులకు సూచిస్తున్నాం.

– డా.వి.గౌతమి, పీహెచ్‌సీ, అంబాజీపేట

విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చాటాలన్నదే లక్ష్యం



మోడేకుర్రులో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, వారిలో క్రీడా ప్రతిభను వెలికి తీయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రోత్సాహక కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థుల క్రీడలకు సంబంధించి జగనన్న క్రీడా సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. మండలంలో ఈ సామగ్రి పంపిణీని మోడేకుర్రులో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆ గ్రామంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కిట్లను ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జగ్గిరెడ్డి పంపిణీ చేశారు. ఎంపీపీ మార్గన గంగాధర రావు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకే క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. దానిలో భాగంగా స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో 238 పాఠశాలలకు కిట్లు వచ్చాయన్నారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్‌లు కుడుపూడి రామలక్ష్మి, నెల్లి లక్ష్మీపతిరావు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ గోగి సురేష్, పర్సన్ చోడపనీడి చిన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు పాల్గొన్నారు.

సీతారామయ్య మృతికి ఎమ్మెల్యే సంతాపం



దాసరి సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



కొత్తపేటలో ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని బొబ్బర్లంకకి చెందిన సీనియర్ పార్టీ నేత దాసరి సీతారామయ్య మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బొబ్బర్లంకలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సీతారామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం దాసరి సీతారామయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, వెలిచేరు సర్పంచ్ వేముల శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేముల రామన్న, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాస్టర్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపేట: పాస్టర్ సీహెచ్ ఆనందరావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. స్థానిక మద్దులమెరకి చెందిన పాస్టర్ ఆనందరావు ఇటీవల మృతి చెందారు. ఆ గ్రామంలో యూజీఎం చర్చిలో ఆనందరావు సంతాప కార్యక్రమం నిర్వహించారు. జగ్గిరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనందరావు చిత్రపటం వద్ద పుష్పాలుంచి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ముఖ్యంగా కుమారుడు చాట్ల రాజును పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం (డీఎస్), వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పర్యటించి పలు మృతుల కుటుంబాలను పరామర్శించారు. మోదుకూరులో అనారోగ్యంతో మృతి చెందిన ముత్యాల వీరవేణి, జొన్నాడలో మృతి చెందిన కె.జనార్దనరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం ఇటీవల గుండె సంబంధిత వ్యాధికి చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బొడ్డు శ్రీనివాస్ నివాసానికి వెళ్లి యోగక్షేమాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

అన్నింటికీ విద్యార్హతే ప్రామాణికం



గంగలకుర్రులో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ప్రస్తుత పోటీ ప్రపంచంలో అన్నింటికీ విద్యార్హతే ప్రామాణికమని గుర్తించి ప్రతీ విద్యార్థి శ్రద్ధగా చదువుకోవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు మెట్లకాలనీలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది అన్ని వసతులను సమకూర్చారన్నారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి తదితర పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యే చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి.. ఇష్టంతో చదువుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులను హాస్టల్ వార్డెన్‌లు ప్రత్యేక పర్యవేక్షణతో ఉంటూ శ్రద్ధగా చదవించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ నెల్లి పండు, దొమ్మేటి నాగన్న, వెన్నపు రాంబాబు, పితాని కాళీ, కుడుపూడి సత్తిబాబు, పలివెల సుబ్రహ్మణ్యం, నెల్లి సుబ్రహ్మణ్యం, యల్లమిల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా



మామిడికుదురులో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వాహనమిత్ర పథకం ద్వారా ఆటో కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురులో ఆదివారం శ్రీకనకదుర్గ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్మికులతో కలసి ఎమ్మెల్యే జగన్ ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. అయిదో విడతగా ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం అందించారని చిట్టిబాబు గుర్తు చేశారు. ఏడాదికి రూ.10 వేలు వంతున ఆర్థిక సహాయం అందించి కార్మికులను ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ సర్కారుకే దక్కిందన్నారు. ప్రభుత్వానికి కార్మికులు బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి ఆంజనేయులు, సర్పంచ్ గాస్ మొహిద్దీన్, ఎంపీటీసీ వర్ధినేని రాము, ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బళ్ల చిన్న, తోట సతీష్, ఉపాధ్యక్షుడు ఇంగువ చినవెంకన్న, సంయుక్త కార్యదర్శి పొన్నాడ తేజ, కోశాధికారి జిన్నూరి రామకృష్ణ, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం

అంబాజీపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణ ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించారని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వాసంశెట్టి వెంకటశెట్టి, జనుపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. అలాగే తొండవరంలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపు రాంబాబు, మద్దింశెట్టి మల్లిబాబు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకున్నారు. వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యసేవలను అందజేస్తామని ప్రజలకు వివరించారు. ఆదివారం సెలవు అయినా వైద్యారోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఇప్పటికే మండలంలోజొన్నాడలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు పూర్తి కాగా ఈనెల మూడున చెముడులంకలో ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెచ్‌ఈలు బి.సూర్యనారాయణ, ఏపీపీ రాజా తదితరులు పాల్గొన్నారు.

విజయములివ్వు విఘ్నేశ్వరా..



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో లక్ష్మీగణపతి హోమ పూజల్లో భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ నిర్వహించారు. అనంతరం విశేష పూజలు జరిగాయి. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరికపూజ చేశారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 56 మంది భక్త దంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 341 మంది భక్తులు, శ్రీలక్ష్మీ గణపతి హోమంలో 21 మంది భక్త దంపతులు పాల్గొన్నారు. పది మంది చిన్నారులకు నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాశన, తులాభారం వంటివి నిర్వహించారు. తొమ్మిది మంది తమ నూతన వాహనాలకు పూజ చేయించుకున్నారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,35,337 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పలు చోట్ల స్వచ్ఛతా హి సేవా ర్యాలీలు



బెల్లంపూడిలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సర్పంచ్ మహాలక్ష్మి

సఖినేటిపల్లి: ప్రధాని మోదీ పిలుపుతో ఆదివారం టేకిశెట్టిపాలెంలో బీజేపీ శ్రేణులు ఆధ్వర్యాన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. 5వ వార్డులో మెంబర్, పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస్ నగేష్ చీపురు పట్టి పరిశుభ్రం చేశారు. చెత్తను రోడ్డు పక్కన అంటించారు. మాజీ ఎంపీపీ లింగోలు మహాలక్ష్మి, గిడుగు తాతాలు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ, కార్యదర్శి కొండా సూరన్న, సిబ్బంది మోరం నాయుడు, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

వీవీ మెరకలో స్వచ్ఛభారత్..

గ్రామంలోని ఓ పంట కాలువగట్టుపై ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, ఎంపీటీసీలు ఇంజేటి కృష్ణవేణి, గుబ్బల ఆంజనేయులు కలిసి స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఇందులో వారంతా పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే చెత్తను అక్కడే అంటించారు.

మలికిపురం: మండలంలోని లక్కవరంలో మలికిపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హి ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.దుర్గాప్రసాద్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ, బండెల సంపత్ కుమార్, తోలేటి సతీష్, ఆచంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మి అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గ్రామంలోని పలు ప్రాంతాల్లో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు మహాలక్ష్మి ఫౌండేషన్ సభ్యుడు బండి రమేష్ అవగాహన కల్పించారు.

మామిడికుదురు: ప్రధాని మోదీ పిలుపు మేరకు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో పార్టీ శ్రేణులు పరిసరాల పరిశుభ్రత పాటించారు. నగరం పీహెచ్‌సీలో డాక్టర్ కేజే ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలోనూ పరిసరాల పరిశుభ్రతలో పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు రెడ్డి చంటి, నెల్లి లక్ష్మీపతిరావు, ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు వీధులు, ఇంటి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. శుభ్రతపై నినదిస్తూ ర్యాలీలు నిర్వహించారు. అవిడి, బిళ్లకుర్రుల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రావులపాలెం: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రావులపాలెంలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మడికిలో ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, చొప్పెల్లలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, చెముడులంకలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు తదితరులు స్వచ్ఛతా హీ సేవ ర్యాలీలు ప్రారంభించారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



వీవీమెరకలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో సీఎం జగన్ సహకారంతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం వీవీమెరక వెలంకాయ కాలువగట్టు ఏరియాలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, నాయకులు జాన శంకరరావు, ఇంజేటి విజయ్ కుమార్, గెడ్డం అమ్ములు పాల్గొన్నారు.

పరిశ్రమలను ప్రోత్సహించాలని కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి దర్శనాజర్దోష్‌కు వినతిపత్రం ఇస్తున్న గంగాధరం

మామిడికుదురు: కోనసీమ జిల్లాలోని బండారులంకలో టెక్స్‌టైల్ పరిశ్రమతో పాటు పాశర్లపూడిలోని కొబ్బరి బొమ్మల పరిశ్రమను ప్రోత్సహించాలని కోరుతూ కేంద్ర జౌళి శాఖ మంత్రి దర్శనా జర్దోష్‌కు వినతిపత్రం ఇచ్చానని ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం ఆదివారం తెలిపారు. బండారులంక చేనేత చీరలకు శతాబ్దాల నాటి చరిత్ర ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎంతో నైపుణ్యం కలిగిన నేత కార్మికులు ఇక్కడ నేటికీ చేనేతపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కోనసీమ కొబ్బరికి ప్రసిద్ధి. కొబ్బరి పీచుతో పలు కళాత్మక బొమ్మలు తయారు చేస్తూ మహిళలు జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. బండారులంక చీరలు, క్యాయర్ ఫైబర్ బొమ్మలు రెండు విభిన్న మినీ క్లస్టర్లుగా అభివృద్ధి చేయాలని కోరామన్నారు. కేంద్ర మంత్రిని విశాఖపట్నంలో కలసి వినతిపత్రం ఇచ్చామని, కొబ్బరి పీచుతో తయారు చేసిన బొమ్మలను కూడా మంత్రికి ఇవ్వడం జరిగిందన్నారు. తాము చేసిన సూచనపైమంత్రి సానుకూలంగా స్పందించారని గంగాధరం తెలిపారు.

కుమ్మర, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరబ్రహ్మం



మాచవరంలో నూతనంగా ఎంపికైన కుమ్మర, శాలివాహన సంఘ నాయకులు

అంబాజీపేట: కుమ్మరి శాలివాహన సంఘ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా మానేపల్లి వీరబ్రహ్మం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మాచవరంలో ఉన్న కుమ్మరి శాలివాహన సంఘ భవనంలో వెల్ల పాండురంగారావు అధ్యక్షతన ఆదివారం కోనసీమ జిల్లా నూతన కార్యవర్గ ఎంపిక జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షుడిగా వెల్ల పాండురంగారావు, అధ్యక్షుడిగా వీరబ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా పుల్లేటికుర్తి రత్నం, ప్రధాన కార్యదర్శిగా దాలిపర్తి భీమేశ్వరరావు, సహాయ కార్యదర్శిలుగా అంబటి వీరబాబు, ఏడిద రమేష్, కోశాధికారిగా సఖినేటిపల్లి పెద్దిరాజు, న్యాయ సలహాదారుగా ఎల్లా శేఖర్, అధికార ప్రతినిధిగా ఆదుర్తి నారాయణ మూర్తి, ప్రచార కార్యదర్శులుగా ర్యాలి శ్రీనివాస వడయార్, పాలకొల్లు వెంకటరమణలు ఎంపికయ్యారు. అధ్యక్షుడు వీరబ్రహ్మం మాట్లాడుతూ మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై శాలివాహన సంఘం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోనసీమలోని అన్ని మండలాల శాలివాహన నాయకులు పాల్గొన్నారు.

బాలయోగికి ఘన నివాళి



పాశర్లపూడిలో బాలయోగి విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

కొత్తపేట: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కొత్తపేటలో టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో బాలయోగి విగ్రహానికి సత్యానందరావు తదితరులు పూలమాలలు వేశారు. బండారు మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్‌గా, ఎంపీగా, లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి సేవలు, జిల్లా ముఖ్యంగా కోనసీమ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడికుదురు: బాలయోగి సేవలు చిరస్మరణీయమైనవని మాజీ జెడ్పీటీసీ మద్దాల కృష్ణమూర్తి శ్లాఘించారు. బాలయోగి జయంతి సందర్భంగా పాశర్లపూడి కొండాలమ్మ చింత సెంటర్‌లో ఉన్న విగ్రహానికి టీడీపీ నాయకులు ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పి.గన్నవరం: దివంగత బాలయోగి జయంతిని ఆదివారం స్థానిక అక్విడెక్టు పార్కులో మండల టీడీపీ అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాలయోగి విగ్రహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు.